# పత్తికి కష్టం.. వరికి నష్టం..

**వర్షానికి రాలుతున్న, నల్లబారుతున్న తెల్ల బంగారం**

- కోత దశలో నేలవాలుతున్న పైరు.. కల్లాల్లో తడిసి ముద్దవుతున్న ధాన్యం..
- మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో అన్నదాతలు ఆగమాగం



తానూర్‌లో ఏరడానికి సిద్ధంగా పత్తి

## నల్లబారుతోంది..

- కూలీల కొరతతో చేలలోనే పత్తి
- ఇబ్బందులకు గురవుతున్న రైతులు

తానూర్, డిసెంబర్ 6 : నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని దాదాపు 33 గ్రామాల్లో 25 వేల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. పత్తి పగిలి వారం రోజులు అవుతోంది. పత్తిని చూసి రైతులు మురిసి పోవాలా.. తీసేందుకు కూలీలు దొరకక్క బాధ పడాలా.. అనే దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సకాలంలో ఏరకుంటే పత్తి నేలరాలి నష్టపోయే ప్రమాదం ఉంది. దీనికి తోడు మిగ్‌జాం తుఫాను ప్రభావం వల్ల రెండు రోజుల నుంచి వాతావరణంలో భిన్న మార్పులో చోటు చేసుకుంటున్నాయి. ముసురు కారణంగా పత్తికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల పత్తి నల్లబారుతోంది. మామూలుగా వ్యవసాయ పనులకు వచ్చే కూలీలకు రూ.300 నుంచి రూ.400 తీసుకుంటారు. ఈ ఏడాది కూలీల కొరత కారణంగా డిమాండ్ పెరిగింది. రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు కూలీ ఇస్తేనే వస్తున్నారు.

## చేతికందే వేళ.. నేలరాలుతున్న పత్తి..

- రైతులకు వేదన మిగులుస్తున్న తెల్లబంగారం
- అకాల వర్షాలతో తీరని నష్టం
- గతేడాదితో పోలిస్తే పెరిగిన సాగు విస్తీర్ణం
- తీవ్రంగా వేధిస్తున్న కూలీల కొరత
- కేజీకి రూ. 10 కూలీ ఇస్తామన్న దొరకని పరిస్థితి



రైతులు ఎవరి చేనులో వారే కొద్దికొద్దిగా ఏరుకుంటున్న పత్తి

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 6(నమస్తే తెలంగాణ): ఆరుగాలం కష్టపడి పండించిన తెల్లబంగారం కళ్లముందే నేలరాలిపోతోంది. పగిలిన పత్తి కాయలతో చేళ్లని తెల్లబంగారంతో మెరిసిపోతుండగా ఆనందపడాల్సిన రైతులు.. పత్తి ఏరేందుకు కూలీలు దొరకక మనోవేదనకు గురికావాల్సి వస్తోంది. మార్కెట్ పత్తికి మంచి డిమాండ్ ఉన్నప్పుడు అమ్ముకోవాలని రైతులు భావిస్తుంటే.. పత్తిని ఏరేందుకు కూలీలు దొరకక పోవడం సమస్యగా మారింది. జి

ల్లాలోని 15 మండలాల్లో 4.60 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. ఇందులో సుమారు 3.50 బలక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. గతేడాది దాదాపు 3.30 లక్షల ఎకరాల్లో ఈ పంట వేశారు. మంచి మద్దతు ధర రావడంతో గతేడాది కంటే ఈ ఏడాది సుమారు 20 వేల ఎకరాల వరకు పత్తిని రైతులు ఆదనంగా సాగుచేశారు. ఈ ఏడాది పత్తి దిగుబడి 12 నుంచి 13 లక్షల క్వింటాళ్ల వరకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది రైతులు కిలో పత్తి ఏరేందుకు కూలీలకు రూ. 5 నుంచి రూ. 7 వరకు కూలి చెల్లించారు. ఈ ఏడాది రూ. 10 ఇస్తామన్నప్పటికీ కూలీలు దొరకని పరిస్థితి నెలకొంది. ఇంతే కాకుండా కూలీల ప్రయాణ ఖర్చులు భరించేందుకు సిద్ధంగా ఉన్నా, పత్తి ఏరేందుకు ముందుకు రావడం లేదు.. దీంతో కొంత మంది రైతులు వారి కుటుంబసభ్యులు కలిసి పత్తిని ఏరుకుంటున్నారు. జిల్లాలో సుమారు 97 వేల రైతు కుటుంబాలున్నాయి. రైతు కూలీలు సుమారు 99 వేల మంది ఉన్నారు. మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న మండలాల్లో పత్తిని ఏరేందుకు ప్రతి సంవత్సరం పొరుగు రాష్ట్రం నుంచి కూలీలు వస్తారు. యావత్‌మాల్, నాందేడ్ జిల్లాల నుంచి కూలీల కుటుంబాలు ఇక్కడికి వచ్చి రెండు మూడు నెలల పాటు ఇక్కడే ఉంటాయి. ఈ ఏడాది అక్కడి నుంచి కూడా రాలేదు.

### పంట తడిస్తే నష్టమే..



నేను ఐదెకరాల్లో పత్తి వేశాను. మొత్తం పత్తి పగిలి నేల రాలిపోతోంది. అకాల వర్షాలతో పత్తి చేనులోనే తడిసి పోతున్నది. వారం రోజుల నుంచి కూలీల కోసం వెతుకుతున్నప్పటికీ ఎవరూ ఏరేందుకు ముందుకు రావడం లేదు. ఇప్పుడు మేమే పత్తిని ఏరుదామంటే, ఈ వర్షాలు వచ్చి పడ్డాయి. మొన్నటి వరకు ఎన్నికలు ఉండడంతో కూలీలు పత్తి ఏరేందుకు ముందుకు రాలేదు. ఇప్పుడు వర్షాలతో పత్తి నేలపాలవుతోంది. ఇగ మాకు నష్టమే మిగిలేట్లు ఉంది.

*- రుకాసీ మోతీరాం, రైతు, జైనూర్*



వర్షంలో తడుస్తున్న కోసి ఎండబెట్టిన వరిపంట

### బెజ్జూర్ లో ఎడతెరిపిలేని వర్షం

బెజ్జూర్, డిసెంబర్ 6: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో మండలంలో పత్తి, వరి పంటలు తడసి పోతున్నాయి. ప్రస్తుతం రైతులు వరి కోతలతో పాటు పత్తి తీస్తున్న నేపథ్యంలో పంటలు తడవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈదురు గాలులు వీస్తుండడంతో చలి తీవ్రత పెరిగి కూలీలు పనికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

మంచిర్యాల, డిసెంబర్ 6(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో రైతులు ఆగం అవుతున్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతోపాటు మన రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి పలు ప్రాంతాల్లో చిరుజల్లులు పడుతున్నాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడం, ఈదురుగాలులు వీస్తుండడతో జనం వణికిపోతున్నారు. ఇలాంటి వాతావరణంతో పత్తిపంటకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. సేకరణ దశకు వచ్చిన పత్తి వర్షాలకు తడిసి చేలలోనే రాలిపోతున్నది. పైగా తడిసిన పత్తి రంగు మారుతోంది. ఫలితంగా దిగుబడి తగ్గిపోవడంతోపాటు గిట్టుబాటు ధర వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. ఏరిద్దామంటే వర్షాలకు, చల్లని వాతావరణానికి కూలీలు దొరకడం లేదు. దీంతో ఆరుగాలం కష్టపడి, రెక్కలు ముక్కలు చేసుకొని పంట కండ్ల ముందే పాడవుతుంటే ఏం చేయలేని రైతన్నలు నిస్సాహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కొన్ని చోట్ల వరి కోయగా.. మరికొన్ని చోట్ల ధాన్యాన్ని కల్లాలకు తరలించారు. చిరుజల్లులతో వరి పైరును, ధాన్యాన్ని కాపాడుకోవడానికి అన్నదాతలు తండ్లాడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, కవర్లు కప్పుతున్నారు. రేపో, మాపో వరి కోతలు చేద్దామనుకున్న రైతులు చేతికి అందివచ్చిన వర్షాలకు నేలకొరుగుతుంటే చూసి లబోదిబోమంటున్నారు. అకాల వర్షాలు చేతికొచ్చే సమయంలోనే తమను ఆగం చేస్తున్నాయని వాపోతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తడిసిన పత్తిని, ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్న రైతుల దృశ్యాలే కనిపిస్తున్నాయి.

### 13 లక్షల ఎకరాల్లో పంటకు దెబ్బ..

ఈదురుగాలులు, చిరుజల్లులతో పెద్దగా పంట నష్టం ఏం లేదని అధికారులు చెప్తున్నా.. చేతికొచ్చిన పత్తి, వరికి మాత్రం కోలుకోలేని దెబ్బ అని రైతులు చెప్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో వరి, పత్తి సాగు(ఎకరాలు)**

| జిల్లా | పత్తి | వరి |
|---|---|---|
| నిర్మల్ | 1,37,465 | 1,32,926 |
| మంచిర్యాల | 1,47,515 | 1,39,410 |
| ఆదిలాబాద్ | 3,94,125 | 1,787 |
| ఆసిఫాబాద్ | 3,30,171 | 55,351 |
| మొత్తం | 10,09,276 | 3,29,474 |

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ సీజన్‌కు సంబంధించి దాదాపు 10.09 లక్షల ఎకరాల్లో పత్తి, 3.29 లక్షల ఎకరాల్లో వరి, మరో మూడు నుంచి నాలుగు లక్షల ఎకరాల్లో పప్పు దినుసుల, సోయా, జొన్నలు, ఇతర పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెప్తున్నాయి. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల రైతులు రాష్ట్రంలోనే అత్యధికంగా పత్తి సాగు చేయగా.. నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో వరి సాగు వేశారు. అకాల వర్షాలకు దాదాపుగా 13 లక్షల ఎకరాల్లో పంటలపై ప్రభావం పడతోందని వ్యవసాయ రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారీ నష్టం కాకపోయిన దిగుబడులు తగ్గి, పత్తి రంగు మారి, ధాన్యం తడిసి తక్కువ ధరకు పంటలు అమ్ముకోవాల్సి వస్తుందని చెప్తున్నారు. తుఫాన్ ప్రభావం ఇప్పుడే మొదలైందని బుధవారం అర్ధరాత్రి భారీ వర్షాలు, ఈదురు గాలులు వస్తే మాత్రం రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



వర్షానికి తడిసిన పత్తి పంట

### తుఫాన్.. రైతుల పరేషాన్

*వాంకిడి/కెరమెరి,డిసెంబర్ 6: మిజాంగ్ తుఫాన్ కారణంగా వర్షం, ఈదురు గాలులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండు రోజులుగా చిరు జల్లులు పడుతుండగా, వాతావరణం చల్లబడింది. మిర్చి, పత్తి పంట నేలరాలుతున్నది. పత్తి తడిసి పోయి రైతుకు నష్టం వాటిల్లుతున్న ది. కెరమెరి మండలంలో కంది పంట సైతం ఏపుగా పెరిగి పూతపూసి కాయలు కాస్తున్న నేపథ్యంలో ఈదురు గాలులతో నేల కొరిగాయి. అకాల వర్షంతో అన్నదాతలు పరేషాన్ లో పడ్డారు.*

### తడిసిన ధాన్యం

కుంటాల, డిసెంబర్ 6 : నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు కోసిన ధాన్యాన్ని ఆరబోశారు. మిగ్‌జాం తుఫాను ప్రభావం వల్ల చినుకులు కురుస్తుండడంతో ధాన్యం తడుస్తోంది. తడిసి వడ్ల గింజలు మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్‌లు కప్పుతున్నారు.



కుంటాలలో ఆరబోసిన ధాన్యాన్ని టార్పాలిన్‌తో కప్పిన రైతు



పెంచికల్‌పేట్ : ధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతు

### రాలుతున్న మిరప కాయలు

పెంచికల్‌పేట్, డిసెంబర్ 6 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పెంచికల్‌పేట్ మండల వ్యాప్తంగా పత్తి ఏరుతుండగా.. వరి పంటను కూడా కొస్తున్నారు. రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టడానికి తీసుకెళ్తున్నారు. తడవకుండా కవర్లు కప్పుతున్నారు. పత్తిని ఏరడానికి కూలీలు దొరకక పోవడంతో తడిసి నల్లబారుతున్నాదని, మిరప తోటలో కాయలు కూడా రాలిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు.



బండల్‌నాగపూర్‌లో ముసురు ఈదురుగాలులకు వంగిన కంది పంట

### ముసురు వానతో రైతులకు ఇబ్బందులు

తాంసి(తలమడుగు), డిసెంబర్ 6 : తాంసి, తలమడుగు మండలాల వ్యాప్తంగా ముసురు పడుతున్నది. తేలికపాటి వానకు తోడు ఆకాశమంతా మేఘావృతమై చల్లటి గాలులు వీచాయి. పత్తి, కంది పంటలకు నష్టం కలుగుతుందని రైతులు భయపడుతున్నారు.



దస్తురాబాద్ : ధాన్యంపై కప్పిన కవర్లపై నిలిచిన వర్షపు నీరు

### నేలకొరిగిన పంట.. తడిసిన ధాన్యం..

దస్తురాబాద్, డిసెంబర్ 6 : మిగ్‌జాం తుఫాను ప్రభావం వల్ల పంటలు నేలకొరుగుతున్నాయి. ధాన్యం తడిసి ముద్దవుతున్నది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో కోత దశకు వచ్చిన వరి పంట నేలకొరిగింది. ధాన్యంపై కప్పిన కవర్లపై వర్షపు నీరు నిలిచింది. ధాన్యం బస్తాలు తడిశాయి. ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు అవస్థలు పడ్డారు. అధికారులు చర్యలు తీసుకొని.. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

# కాంగ్రెస్‌కు ప్రోటోకాల్ తిప్పలు

- కుమ్రం భీం జిల్లాలో విచిత్ర పరిస్థితి
- అధికారం ఉన్నా ప్రయోజనం సున్న
- ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థుల విజయం
- ఒకరు బీఆర్ఎస్, మరొకరు బీజేపీ నుంచి ప్రాతినిథ్యం
- తలలు పట్టుకుంటున్న అధికార పార్టీ నేతలు

ఆసిఫాబాద్,డిసెంబర్ 6: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కానీ ఆ పార్టీకి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో విచిత్ర పరిస్థితి ఎదురైంది. ఇక్కడ కాంగ్రెస్ ఖాతా తెరవలేదు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు,అధికారిక కార్యక్రమాల్లో ఆ పార్టీకి ప్రోటోకాల్ తిప్పలు తప్పవు. జిల్లాలోని రెండు నియోజవర్గలోనూ ఆ పార్టీకి ఎమ్మెల్యే సీటు దక్కకపోవడంతో, పెద్ద సమస్య వచ్చి పడింది. ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే కోవలక్ష్మి, సిర్పూర్‌లో బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా పాల్వాయి హరీశ్‌బాబు గెలిచారు. ఈ క్రమంలో ప్రభుత్వం అధికారికంగా చేపట్టే కార్యక్రమాల్లో ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలే కీలకం కానున్నారు. రెండో చోట్ల కూడా కాంగ్రెస్ అభ్యర్థులు శ్యాంనాయక్, రావి శ్రీనివాస్ ఓటమి చెందారు. రాష్ట్రంలో అధికారం కాంగ్రెస్ పార్టీదేనని చెబుతున్నా, జిల్లాలో మాత్రం ప్రోటోకాల్ సమస్యపై ఆ పార్టీ నాయకులు మదనపడుతున్నారు. ప్రభుత్వం నిధులు ఇస్తే వాటిని క్షేత్రస్థాయిలో ప్రచారం చేసేందుకు కూడా ప్రజాప్రతినిధులు పెద్దగా లేకపోవడంతో పార్టీకి జిల్లాలో గడ్డుకాలమే.

### స్థానిక సంస్థల్లోనూ..

జిల్లాలోని 15 మండలాల్లో సర్పంచ్ స్థాయి నుంచి మొదలుకుంటే ఎమ్మెల్యే వరకు కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో గ్రామస్థాయిలోనూ అధికార కార్యక్రమాలకు ఆ పార్టీ నుంచి ప్రాతినిథ్యం వహించే నాథుడే కరువయ్యారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ప్రస్తుతం ప్రాతినిథ్యం వహిస్తున్నారు. వారి కాల పరిమితి ఉండడంతో స్థానిక కాంగ్రెస్ నాయకుల్లో ప్రోటోకాల్‌పై బెంగ పెరిగింది.

### ఇక ఇన్‌చార్జితోనే..

ప్రభుత్వం ఏర్పాటు జరిగి జిల్లాకు ఇన్‌చార్జిగా ప్రతినిధిని ఏర్పాటు చేసినప్పటికీ, అధికారిక కార్యక్రమాల్లో ఆయన పాత్ర ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది. జిల్లా,నియోజకవర్గ స్థాయిలో జరిగే ముఖ్యమైన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రతినిధిగా పాల్గొంటారు. కానీ క్షేత్రస్థాయిలో నిర్వహించే అధికారిక కార్యక్రమాలకు మాత్రం సమస్య ఉంటుంది. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉండడంతో పాటు కోవలక్ష్మి గతంలో ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం జడ్పీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతూ ప్రజలతో మమేకమై ఉండడం ఆ పార్టీ ప్రజాప్రతినిధులకు ధైర్యాన్నిస్తున్నది. ప్రభుత్వం ఏదైనప్పటికీ ప్రజల మద్దతు ఉన్న పార్టీలోనే కొనసాగాలని పలువురు ప్రజా ప్రతినిధులు పేర్కొంటున్నారు. సిర్పూర్‌లో హరీశ్‌బాబు బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ, అక్కడ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మండల, గ్రామస్థాయిలో ఎక్కవ శాతం ఉన్నారు. ఈ నియోజకవర్గంలో అధికారిక కార్యక్రమాలు నిర్వహించడం పెద్ద సమస్యగా చెప్పుకోవచ్చు.ప్రభుత్వం నిధులు ఇస్తే అవి ప్రజల అవసరాల కోసం స్థానిక ఎమ్మెల్యేలు ఖర్చు చేసి అభివృద్ధి జరిపితే బీఆర్ఎస్,బీజేపీ ఎమ్మెల్యేలకే లాభం చేకూరనుంది. ఒక వేళ నిధులు ఇవ్వకుంటే అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అభాసుపాలు కావడం ఖాయం. ప్రస్తుతం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ రెంటికీ చెడ్డ రేవుల మారింది. నిధులిస్తే ఒక్క బాధ లేకుంటే మరో బాధ అన్నట్లు తయారైంది.

### పత్తి తడిసి ముద్దయ్యింది



*నెన్నెల, డిసెంబర్ 6: ఈ వర్షంతో పత్తి తడిసి ముద్దయ్యింది. గిప్పుడు ఇగ తడిసిన పత్తిని ఎవ్వలూ కొనరు. పత్తి తీసి ఇంట్లో పెట్టుకుందామన్నా రంగు మారిపోతది. వర్షం కారణంగా మాకెంతో నష్టం వచ్చింది. ఇప్పుడే ధర తక్కువగా ఉంది. తడిసిన పత్తికి ధర మరింత తగ్గిపోతది. వర్షానికి చెట్టుమీద ఉంచితే పెద్ద వర్షం పడితే అంతా భూమి మీద పడి పోతది. ఇట్ల కూడా రైతులకు చాలా నష్టమే వస్తుంది. ఈ తుఫాను వల్ల పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేట్లు లేదు. ఐదెకరాల్లో పత్తి పంట సాగు చేసిన. ఒక్క సారి కూడా పత్తిని తీయ లేదు. రెండు మూడు రోజుల్లో తీద్దామనుకున్న. కానీ ఈ తుఫాను కారణంగా తీయలేకపోయిన. పత్తి తడిసి నల్లబడితే ధర కూడా తక్కువ అయితది. గిప్పుడు మార్కెట్‌లో ధర కూడా ప్రైవేటులో తక్కువకే కొంటుండ్రు. సీసీఐ లాంటి వాళ్లు తీసుకుంటే ధర పెరుగుతది కావచ్చు.*

*- లింగం మహేశ్, పత్తి రైతు*

రెబ్బెన : గోలేటి లో తడిసిన కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

